# అసలు విషయం



**రూపాయి పావలా ఇచ్చి న్యూస్ పేపర్ తీసుకుని పరుగెట్టి ప్లాట్ ఫారం మీద నుండి బయల్దేరుతున్న నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ లాస్టు కంపార్టుమెంటులో ఎక్కాను. టిక్కెట్టు తియ్యలేదని మీ అనుమానమా! తీసానండీ బాబూ!**

గోల గోలగా వుంది కంపార్ట్‌మెంట్ అంతా!

ఆడాళ్ళ వినవినలే కాదు, మగాళ్ళ రాజకీయపు వర్చ జోరుగా సాగుతోంది. ఓ మూలన తీరిగ్గా ఓ ముసలాడు చుట్టని గుప్పు గుప్పున రింగు రింగులుగా పొగ వదులుతున్నాడు. కంపార్ట్‌మెంటు అంతా చుట్ట వాసనతో వాంతొచ్చేటట్టు వుంది. అయినా తప్పదు కదా ప్రయాణం! అసలు ఈ ట్రయినే దొరకటం మహా కష్టంగా వుంది. పరుగెట్టిన నా కాళ్ళు విశ్రాంతి కోసం ఓ సీటుని ఆశ్రయించక తప్పదని మెదడుతో గొడవ పెట్టి ఖాళీగా వున్న ఓ సీటు దగ్గర కొచ్చి నిలబడ్డాయి.

బహుశా ఎవరైనా లావెట్రీకి వెళ్ళారేమోనని అనుమానం వచ్చి ప్రక్కతన్ని అడిగాను.

"కూర్చోండి సార్..." అంటూ మర్యాద చేశాడు.

కూర్చుని వాళ్ళ దారిన వాళ్ళుండిలేసి పేపరు తిప్పి అక్షరాల వైపు నా కళ్ళను సాగించాను.

ఎంత సేపయిందో తెలియదుగాని

"ఓసారి పేపరిస్తారా..." ఎవరో అడిగారు.

పేపరిచ్చాను.

"అబ్బే మిమ్మల్ని కాదండి, మీ పక్కాయన్ని" అన్నాడు.

తల తీసేసినట్టయింది. నా పక్కనే యిచ్చి పుచ్చుకోవడాలు జరిగిపోయాయి. ఆ పేపర్నే అందరూ చదువుతున్నారు.

నా కర్థం కాలేదు. ఎందుకు నన్ను అడగటం లేదో! ఇది న్యూస్ పేపర్ కాదా! పోనీ డైలీ కాదా అంటే ఇది కూడా డయిలీ పేపరే.

తల బ్రద్దలు కొట్టుకున్నా, నాలుగు మెయిన్ జంక్షన్‌లు మారినా నాకర్థం కాలేదు.

అందరూ నా వైపు వింతగా చూస్తున్నారే తప్ప నన్ను ఓ మనిషిగా చూట్టం లేనట్టనిపిస్తోంది నాకు.

నా ప్రక్కాయన పేపరు మొత్తం కంపార్టుమెంటు అంతా అలా అలా వీర విహారం సాగిస్తోంది.

కనీసం నీ పేపరు చూస్తాం అని మాట వరసకైనా ఎవ్వరూ అడగలేదు. నాకేం అర్థం కాలేదు.

పేపరు మడిచి చేతులో వుంచుకున్నాను.

ఎవరైనా అడిగితే ఇవ్వొచ్చునని

అర్థం గంట గడిచినా షరా...మామూలే...

నాకేం అర్థంకాక తెలియని విషయాన్ని తెలుసుకోవడంలో తప్పులేదు కదా అని చివరికి వాళ్ళనే అడిగేద్దామని నిర్ణయించాను. అడిగే ముందు నాకో అనుమానం వచ్చి పేంటు జిప్పు చూసుకున్నాను. బానే వుంది.

ప్రక్కాయన్ని పిలిచి-

"మీరేమీ అనుకోనంటే ఓ మాట..." అన్నాను.

"చెప్పండి" అన్నాడతను.

"ఇందాకట్నుంచి మీ పేపర్ని అలా అలా పక్కకు తీసుకు వెళ్ళి పోతున్నారు తంతా. రెండు గంటలు గడిచినా మీ పేపరు మీ దగ్గరకు రాలేదు. మరి నా దగ్గర కూడా పేపరుంది కదా! ఎవరూ అడగరేం?" అన్నాను.

"అదేంటిసార్, జోకేస్తున్నారు?"

"జోకా...భలే బాగుందే?"

"అది కాదండీ, నిజంగా మీకు తెలీదా?" అనుమానంగా అడిగినట్టుంది ఆయన గొంతు.

"తెలీదు కనకనేకదా బాబు అడుగుతుంది మిమ్మల్ని" అన్నాను.

"సరే చెప్తున్నా వినండి, ఏం లేదండీ, ఇక్కడంతా తెలుగు వాళ్ళే. ఈ బోగీలో ఎక్కిన వాళ్ళందరూ తెలుగువాళ్ళే. మరి మీ చేతిలో వున్న ఆ పేపరు ఏ భాషదో మాకు తెలీదు. అందుకనే ఎవరూ మిమ్మల్ని అడగలేదు. అర్థం కాని భాషను ఎవరు చదువుతారు సార్" అన్నాడు.

"ఓహో...అదా అర్థమయింది" అనుకుంటూ నా చేతిలో వున్న పేపరు వైపు చూశాను. మళయాళం డైలీ నన్ను వెక్కిరిస్తోంది.

మాతృభాష తెలుగే అయినా ఉద్యోగరీత్యా కొచ్చిన్‌లో వుండటం చేత అలవాటుగా మలయాళం పత్రికను కొనుక్కున్నాను.

— ఎం.కె.వి. సీతారావ్

### రివర్స్ జోక్

సిటీలో వుండి కాలేజీలో చదువుకుంటున్న కొడుకు చాలా కాలానికి పల్లెకి వస్తే, ఆప్యాయంగా పలకరించి అడిగింది తల్లి:

"ఏం బాబూ! అన్నమే తినడం లేదు?"

"ఏం లేదమ్మా. హోటల్లో తినీ, తినీ ఇంట్లో భోజనం సహించడంలేదు" చెప్పాడు కొడుకు.

తల్లి నిరుత్తరే!

నీల